క్లుప్తంగా

బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా నియోజక వర్గ అధ్యక్షురాలిగా ఉమారాణి

మంగళగిరి: బీసీ వెల్ఫేర్ జేఏసీ మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలిగా నగరానికి చెందిన కొడాలి ఉమారాణి నియమితులయ్యారు. నగరంలోని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ జేఏసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఉమారాణికి బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లి జగన్మోహనరావు, నియోజకవర్గ అధ్యక్షుడు వూట్ల పాల శ్రీనివాస్, జెఎన్టీయూ రిటైర్డు ప్రొఫెసర్ కోదాటి సత్యప్రసాద్, నాయకులు కొడాలి ఉమాశంకర్, కలవకొల్లు గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.

బకింగ్ హామ్ కెనాల్‌లో దిగి వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మూడు తూముల సెంటర్లో నివాసముండే ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ బకింగ్ హామ్ కెనాల్‌లో గురువారం మృతి చెందాడు ఎస్ఐ వినోద్ తెలిపిన వివరాలు.. ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లి వచ్చే మార్గంలో మూడు తూముల వద్ద నివాసముండే చదల శ్రీనివాసరావు (54) చేపలు పట్టేందుకు కుంచనపల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్‌లో దిగాడు అందరూ చూస్తుండగానే ఒకసారిగా నీటిలో మునిగిపోయి, మృతి చెందాడు. ఈ సంఘటనపై భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు



మంగళగిరి: మైనర్లకు ద్విచక్ర వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ ఎస్ఐ మహేంద్ర హెచ్చరించారు. గురువారం నగర వీధుల్లో పట్టణ సీఐ బి అంకమ్మరావు ఆదేశాల మేరకు సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతూ సాటి వాహన దారులను గాయాల పాలు చేస్తున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనాలిస్తే తల్లిదండ్రులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థలోని అన్ని ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కృష్ణానది ఎగువ ప్రాంతం నుంచి రా వాటర్ తీసుకొని శుద్ధి చేసేందుకు అవసరమైన ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించేందుకు గురువారం జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసులు స్థానిక కార్పొరేషన్ అధికారులతో కలసి స్థలం పరిశీలించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో శుద్ధి చేసిన కృష్ణా జలాలను అందించేందుకు ఇప్పటికే ఏఐఐబీ (ఏషియన్ ఇండియన్ బ్యాంక్) సహకారంతో 230 కిలోమీటర్లు పైప్‌లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. కార్పొరేషన్ వ్యాప్తంగా తాగు నీటిని అందించేందుకు అవసరమైన ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సి ఉందని, ఉండవల్లి గ్రామంలో సీఆర్‌డీఏకి ఇచ్చిన దేవస్థానం భూములు తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, దాన్లో భాగంగానే స్థల పరిశీలన చేశామని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ శ్యాంప్రసాద్, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు దంటు బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

107 మందికి కంటి పరీక్షలు

తాడికొండ: శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో తాడికొండలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 107 మందికి వైద్య పరీక్షలు చేశారు. 83 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిని శుక్ర, శనివారాలలో రెండు విడతలుగా ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది. కార్యక్రమంలో పలువురు నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పది విజయానికి పక్కా ప్రణాళిక



పాఠశాల అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్
- విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ
- బడికి రాకపోతే ఇంటికి వెళ్లి విచారణ

తాడేపల్లిరూరల్: ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ, ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై సమావేశాలు నిర్వహించడం, ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో? వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడం ఇవన్నీ కార్పొరేట్ స్కూల్స్‌లో వింటూ ఉంటాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా శాఖలో అనేక సంస్కరణలు చేపట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో సైతం వీటిని అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు బడికి రాకపోతే ఇంటికి వెళ్లి ఆరాతీసి బడికి పంపేలా చర్యలు తీసుకోవడం, వారి ప్రిపరేషన్‌ను పరిశీలించడంతోపాటు తల్లిదండ్రులకు కూడా బాధ్యత గుర్తుచేస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. వెనుకబడిన విద్యార్థుల కోసం సబ్జెక్టు వారీగా రెండు గంటలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు కూడా ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలో 7221 విద్యార్థులు

ఏప్రిల్ మూడు నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 3921 మంది ఉండగా, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో 3,362 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మొత్తం 7221 మంది విద్యార్థులు ఉన్నారు.

గ్రూపులుగా విభజన

తరగతి గదుల వరకే ఉపాధ్యాయుల బోధన పరిమితం కాకుండా విద్యార్థుల ప్రగతి ఆధారంగా ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సబ్జెక్టు అర్థమయ్యేలా బోధించడం, ముఖ్యమైన పాఠ్యాంశాలను వారితో సాధన చేయించడం, రాయించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పరీక్షలంటే భయం పోయింది.



రెండు పూటలా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పబ్లిక్ పరీక్షలంటే భయం పోయింది. పాఠశాలలో టీచర్లు అన్ని సబ్జెక్టులను బోధిస్తున్నారు. పరీక్షలకు ఇంకా సమయం ఉంది. క్లాస్‌లో చెప్పిన పాఠాల్లో కఠినమైన చాప్టర్లను స్టడీ అవర్స్‌లో మళ్లీ రివిజన్ చేస్తున్నారు. ఎక్కువ మార్కులు సాధిస్తానన్న నమ్మకం పెరిగింది.

–ఎ.ఉదయ నాగలక్ష్మి, విద్యార్థిని, వడ్డేశ్వరం

సందేహాలను నివృత్తిచేస్తున్నారు



సబ్జెక్టు వారీగా ఏవైనా సందేహాలు వస్తే ఉపాధ్యాయులు అర్థమయ్యేలా మళ్లీ చెబుతున్నారు. ప్రస్తుతం చాప్టర్ల వారీగా రివిజన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తానన్న నమ్మకం ఏర్పడింది. ప్రత్యేక తరగతులు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి.

–పి.శ్రీదివ్య, విద్యార్థిని, పెనుమాక

తల్లిదండ్రుల సమావేశాలు

కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన తల్లిదండ్రుల సమావేశాలు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అమలవుతోంది. పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పిల్లలు ఎన్ని గంటలకు నిద్ర లేస్తున్నారు? ఎన్ని గంటలు చదువుతున్నారు అనే వివరాలపై వారి నుంచి సమాధానం రాబడుతున్నారు. పిల్లల స్థాయిని తెలియజేసి వారు మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు.

మహిళా చేయూతతోనే ఆర్థికాభివృద్ధి



మహిళమార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి
- ఫిరంగిపురంలో డాక్టర్ వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

ఫిరంగిపురం: మహిళలకు చేయూతతోనే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఫిరంగిపురంలో డాక్టర్ వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిలు గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశచరిత్రలోనే మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఇటువంటి మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా మార్కెట్ ధరకన్నా తక్కువకే నాణ్యమైన నిత్యావసర వస్తువులు గ్రామీణులకు దీనిద్వారా అందుతాయని తెలిపారు. మార్ట్‌ల ద్వారా పదిమంది మహిళలకు ఉపాధితోపాటు వచ్చే లాభాలతో మెరుగైన జీవనోపాధి లభిస్తుందని ఆకాక్షించారు.

పొదుపు మహిళల వ్యాపార దక్షతకు నిదర్శనం

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 14మార్ట్‌లు ఏర్పాటుకాగా లక్షల్లో విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలతో కాకినాడలో మొదలైన మహిళా మార్ట్ నాలుగు నెలల్లోనే రూ.74లక్షల టర్నోవర్‌ను సాధించందని చెప్పారు. నెలకిందట అనకాపల్లిలో ప్రారంభమైన మహిళా మార్ట్ పదిమందికి ఉపాధి కల్పిస్తూ నిత్యం రూ.40వేల విలువైన సరుకులను విక్రయించే స్థాయికి ఎదిగిందన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో సంఘటితమైన పొదుపు మహిళల వ్యాపార దక్షతకు నిదర్శనంగా నిలుస్తాయని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా ఫిరంగిపురంలో మహిళా మార్ట్‌ను నెలకొల్పుతున్నట్లు తెలిపారు. మహిళలు అందరూ దీనిని వినియోగించుకొని లబ్ధిపొందాలని ఆకాక్షించారు. తొలుత సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, వైస్ ఎంపీపీ జి.చంద్రం, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.సంధ్యారాణి, సర్పంచులు మేడా బాబు, డి.మెల్కియా, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ, ఏపీఎం సుజాత, వై. రమాదేవి, షేక్ సలీం, యల్లారెడ్డి, అప్పిరెడ్డి, ఎస్.చిన్నప్ప, చౌడయ్య, సంజీవరెడ్డి, వై.ఆశీర్వాదం, పలు శాఖల అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన

- నిడుముక్కలలో గడప గడపకు మన ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

నిడుముక్కల(తాడికొండ): కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని కరపత్రాలు అందజేసి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు ఆయా సమస్యలను పరిష్కారం దిశగా చర్యలు తీసుకొని ప్రజల్లో భరోసాని కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి చూపించాడన్నారు. అధికారం కోసం బాబు ప్రతిపక్ష పార్టీలను గుప్పెట్లో పెట్టుకొని ఎల్లో మీడియాలో విష ప్రచారానికి దిగాలని చూడటం దుర్మార్గమని, అబద్దాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన బాబు ఆయనకు వత్తాసు పలుకుతున్న తోక పార్టీలకు రాబోయే రోజుల్లో చరమ గీతం తప్పదన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీ బోడపాటి సుశీల, మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, ముఖ్య నాయకులు తాళ్ళ శివనాగరాజు, పలువురు గ్రామ సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రాతూరు గ్రామంలో నిర్మిస్తున్న రహదారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాతూరులో గురువారం నుంచి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ప్రాతూరులో విస్తృతంగా పర్యటించారు. స్థానికులు ఎమ్మెల్యే ఆర్కేకి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో రూ.కోటీ 80 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దాన్లో భాగంగా కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి చేయవలసిన అభివృద్ధి పనులు పరిశీలించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.45 లక్షలు కేటాయించడంతో ప్రాతూరు శివాలయం నుంచి తాడేపల్లి కలుపుతూ 265 మీటర్ల పొడవు ఎనిమిది మీటర్ల వెడల్పు ఉన్న రహదారులు గ్రావెల్ సెల్లింగ్ చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగూర్ వలీ తెలిపారు. అనంతరం నాలుగు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. సంకురు నాగేశ్వరరావు ఇంటి దగ్గర నుంచి బెజ్జం రమేష్ ఇంటి వరకు 140 మీటర్ల పొడవున నాలుగు మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్ నిర్మాణాన్ని చేపట్టామని, ఈ పనికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.15 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో సీసీ రోడ్ నిర్మాణం పూర్తి చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రతి ఏడాదీ 20 వేల కేసులు పెరుగుతున్నాయి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అమలాపాల్

తాడేపల్లిరూరల్: భారతదేశంలో పెద్ద వయస్సు వారిలో దాదాపు 10శాతం మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్నారని డాక్టర్ అమలాపాల్ అన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 20 వేలకు పైగా నూతన డయాలసిస్ కేసులు పెరుగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా మణిపాల్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అమలాపాల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూత్రపిండాల సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడంలో సాధించిన మైలురాళ్లను వివరించారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ ఎవిఎస్ఎస్ఎన్ శ్రీధర్, కన్సల్టెంట్ యూరాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ రవిశంకర్ గంజి, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదిగినపుడే నిజమైన ప్రగతి

మోతడక సీఐటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మోతడక(తాడికొండ): మహిళలు పురుషులకు దీటుగా ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగినపుడే నిజమైన ప్రగతి అని హోప్ విన్ ఆసుపత్రి చైర్మన్, స్టార్ హాస్పిటల్ సహ గైనిక్ కన్సల్టెంట్ డాక్టర్ మహమ్మద్ షామా సుల్తానా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మోతడక సీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో అతిథి చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కోశాధికారి డాక్టర్ వై అనంతకుమారి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో పురుషులతోపాటు సమానంగా మహిళలు అన్ని రంగాలలో సహకారం అందిస్తున్నారన్నారు. అతిథులతోపాటు పలువురు మహిళలను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి రంగారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగ శ్రీనివాసరావు, మహిళా సాధికారత కమిటీ సభ్యులు ఎస్ శాంతిప్రియ, డి గంగా, ఎ లలిత, బి రోజారాణి, జి నాగలక్ష్మి, డి లావణ్య, డి రోజా, వి మయూరి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్

మంగళగిరి: నగరంలో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల నృసింహస్వామి ఆలయం వద్ద ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విజయవాడ సితార సెంటర్‌కు చెందిన గోలి శ్రీనివాసరావు, మంగళగిరి గోపాలకృష్ణ థియేటర్ వద్ద నివసిస్తున్న వల్లభనేని శివరామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా దేవాలయం దగ్గర ద్విచక్ర వాహనాన్ని దొంగిలించినట్లు నేరం ఒప్పుకుని వాహనాన్ని పోలీసులకు అప్పగించగా నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకయ్య మృతి




మంగళగిరి: వైఎస్సార్ సీపీ నాయకుడు, శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థాన ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు కంచర్ల వెంకయ్య (53) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వెంకయ్య వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేసినట్లు నాయకులు కొనియాడారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు సంతాపం తెలియజేశారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావులతోపాటు పలువురు నాయకులు వెంకయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

పోలీసుల అదుపులో కరెంటు తీగెల దొంగలు

తాడికొండ: ప్రైవేటు వెంచర్లలో కరెంటు తీగెలు, ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించిన కేసులో నిందితులను తాడికొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 4 ప్రైవేటు వెంచర్లలో ఉన్న కరెంటు తీగెలు, ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి స్క్రాప్ దుకాణాలకు అమ్మిన కేసులో తుళ్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాడికొండ విద్యుత్ శాఖ ఏఈఈ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్న పోలీసులకు నిందితులు పట్టుబడ్డారు. భారీగానే వీరు విద్యుత్ వైర్లు తస్కరించినట్లు సమాచారం కాగా రాజధాని ప్రాంతంలో జరిగిన విద్యుత్ వైర్లు, హైటెన్షన్ విద్యుత్ టవర్ల యాంగ్లర్‌లు దోచుకున్న కేసులో వీరికి సంబంధం ఉందా లేదా అనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు. లక్షల విలువ చేసే తీగెలను దొంగిలించి స్క్రాప్ కింద అమ్ముకొని అందిన కాడికి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. పూర్తి స్థాయి విచారణ జరిగితే కానీ వివరాలు బయటపడే పరిస్థితి లేదు.

మహిళలకు సమాన హక్కును కల్పించింది అంబేడ్కరే

వీఐటీ- ఏపీ అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో దగ్గుబాటి పురందేశ్వరి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి

తాడికొండ: రాజ్యాంగంలో మహిళలకు, వారి హక్కులకు పురుషులతో సమానంగా అధిక ప్రాధాన్యత కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ- ఏపీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ దేవుళ్లు సంచరిస్తారని, వేల సంవత్సరాల క్రితం వేద కాలంలోనే మహిళలు సమానత్వాన్ని, స్వేచ్ఛను అనుభవించారన్నారు. మహిళా సాధికారతతో దేశం మరింత ఉత్పాదకతను పెంచుతుందని, గర్భంలో ఉన్న ఆడపిల్లలను ముందుగా గుర్తించే పరీక్షల విషయంలో కఠిన చట్టాలని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీఐటీలో ఉన్న 32 శాతం మహిళా విద్యార్థినుల సీట్లను రాబోయే రోజుల్లో 50 శాతానికి పెంచేందుకు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి వీఐటీ పూర్వ విద్యార్థిని, శ్రీవర్ష గ్రూప్ డైరెక్టర్ వర్షా విశ్వనాథ్, వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అనుపమ నంబూరు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న ఉగాది బాలోత్సవం

తాడేపల్లిరూరల్: కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్టుమెంట్ అసోసియేషన్ తాడేపల్లి (క్యాట్) ఆధ్వర్యంలో ఈనెల 22న కుంచనపల్లిలోని అరవింద హైస్కూల్‌లో ఉగాది బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు కోశాధికారి గాదె సుబ్బారెడ్డి తెలిపారు.

పెదకోనేరు ప్రక్షాళన పూర్తి

- ఈ ఏడాది తెప్పోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషి పట్ల స్థానికుల హర్షం



ప్రక్షాళన చేసిన పెదకోనేరు(కల్యాణ పుష్కరణి)

మంగళగిరి: పెదకోనేరు(కల్యాణ పుష్కరణి) ప్రక్షాళన పూర్తయ్యింది. దీంతో కోనేరును అభివృద్ధి పరచడంతోపాటు చుట్టూ ఫెన్సింగ్ వేసి మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కోనేటిలోని దాసాంజనేయస్వామి పూజలందుకుంటుండగా ఈ ఏడాది వైశాఖ పౌర్ణమి రోజున స్వామి తెప్పోత్సవం నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కోనేరులోని నీటిని తొలగించేందుకు 15 ఏళ్ల కిందట ఓఎన్‌జీసీ ప్రయత్నించి సగంలోనే వదిలేసింది. ఆ తర్వాత కోనేరు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి డంపింగ్ యార్డులాగా తయారైంది. దుర్గంధం వెదజల్లుతుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవ తీసుకుని పెద్ద కోనేరును పరిశీలించారు. పెదకోనేరుకు పూర్వవైభవం తీసుకువచ్చి మరలా స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించేలా చూడాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. స్పందించిన అధికారులు కోనేరును బాగు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర దేవాదాయ శాఖకు పంపారు. దేవదాయశాఖ రూ.కోటి కేటాయించింది. దేవస్థానం మరో రూ.50లక్షలు కేటాయించి మొత్తం రూ.1.50 కోట్లతో ప్రక్షాళన పనులు చేపట్టారు. జంగిల్ క్లియరెన్స్ చేసి, కోనేరులోని నీటిని తోడి చుట్టూ ప్రహరీ, మెట్ల నిర్మాణంతోపాటు అన్ని రకాల వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే నిరంతర పర్యవేక్షణలో పనులు పూర్తి చేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషి పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చౌక దుకాణాలలో విజిలెన్స్ దాడులు

తాడేపల్లిరూరల్: రేషన్‌షాపుల్లో ఉండాల్సిన బియ్యం నిల్వ కన్నా 74 బస్తాలు(50 కిలోలు) తక్కువగా ఉండటంపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. తాడేపల్లి మండలం పెనుమాకలో పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేయకుండా, అక్రమంగా తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నట్లు అందిన సమాచారం మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక పౌర సరఫరాల శాఖ అధికారులతో కలసి గురువారం రాత్రి తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలోని రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. డీలర్ భ్రమరాంబ నిర్వహిస్తున్న రేషన్ షాపుని తనిఖీ చేయగా 74 బస్తాల బియ్యం తక్కువ ఉన్నట్లు గుర్తించారు. డీలర్‌పై 6–ఎ కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేయాలని మంగళగిరి సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్‌ను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, స్థానిక పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.